నగదు జమ కావట్లే..!

- అందని ద్రాక్షగా 'బాలిక సంరక్షణ పథకం'
- డబ్బులు జమకావడం లేదని లబ్ధిదారుల ఆరోపణ
- సకాలంలో ఇప్పించాలని వేడుకోలు



మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం

లక్సెట్టిపేట: ప్రభుత్వం బాలిక సంరక్షణ పథకాన్ని 2005 సంవత్సరంలో జీవిత బీమా ఆధ్వర్యంలో మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి పుట్టిన ఆడపిల్లలకు ఈ పథకం వర్తిస్తోంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు అర్హులైన అభ్యర్థులకు పథకం గురించి అవగాహన కల్పించి పూర్తి వివరాలు నమోదు చేస్తారు. గడువు ముగిసిన తరువాత లబ్ధిదారులు ఐసీడీఎస్ అధికారులకు ధ్రువీకరణ పత్రాలను ఐసీడీఎస్ కార్యాలయంలో అప్పజెప్పితే వాటిని పై కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి లబ్ధిదారులకు డబ్బులు బ్యాంకు ఖాతాలో జమచేయబడతాయి. బాలిక సంరక్షణ పథకం ద్వారా గడువు ముగిసిన తర్వాత రావాల్సిన డబ్బులు రావడం లేదనే ఆరోపణలు వస్తున్నవి.

పథకం పూర్తి వివరాలు..

కొత్త బాలిక సంరక్షణ పథకం 2005 ప్రకారం ఆడపిల్లలకు జీవిత బీమా సంస్థ ద్వారా ఇరవై సంవత్సరాలు పూర్తయిన తరువాత డబ్బులు అందేటట్లుగా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇంటిలో ఒక ఆడపిల్ల ఉంటే 20 సంవత్సరాలు పూర్తయిన తరువాత రూ.లక్ష, ఇద్దరు ఉన్నట్లయితే ఒక్కరికి రూ.ముప్పై వేల చొప్పున అందజేస్తారు. తొమ్మిదో తరగతి పూర్తయిన తర్వాత సంవత్సరానికి రూ.పన్నెండు వందల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనాన్ని అందిస్తారు. గడువు పూర్తయినప్పటికీ లబ్ధిదారులకు రావాల్సిన డబ్బులు సకాలంలో రావడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని ఐసీడీఎస్ అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించడం లేదని, సంరక్షణ పథకంపై పూర్తిస్థాయిలో తెలియపరచడం లేదని ఆరోపిస్తున్నారు. లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మూడు మండలాలు లక్సెట్టిపేట పరిధిలోకి వస్తాయి. ఇప్పటి వరకు ఇరవై ఆరు మంది లబ్ధిదారులు గడువు పూర్తి కావడంతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. సకాలంలో డబ్బులు అందడం లేదని కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని డబ్బులు సకాలంలో ఇప్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇంకా డబ్బులు రాలేదు



బాండ్ పేపరు గడువు ముగిసిందని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటికీ డబ్బులు జమ కాలేదు. ఆఫీసుకు నాలుగు సార్లు వెళ్లినా పట్టించుకోవడం లేదు. కేవలం అటెండర్ మాత్రమే ఉంటున్నారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. త్వరగా డబ్బులు ఇప్పించాలి. – అక్కల వెంకన్న, కొత్తూరు, మం.లక్సెట్టిపేట

ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం..

మాకు ఇచ్చిన దరఖాస్తు ఫారాలను, బాండ్ పేపర్లను, ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. కొంతమందికి డబ్బులు జమకావడం లేదని, ఆలస్యం అవుతుందని తెలుపుతున్నారు. పై అధికారులను అడిగితే సీనియార్టీ ప్రకారం ఇస్తున్నామని తెలుపుతున్నారు. త్వరలో డబ్బులు వచ్చేలా చూస్తాం. – చిన్నయ్య, జిల్లా ఐసీడీఎస్ అధికారి

మంచిర్యాలను అభివృద్ధి చేసి చూపిస్తా

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు


పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్/శ్రీరాంపూర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని, మంచిర్యాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తానని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 2, 12 వార్డులకు చెందిన కాంగ్రెస్ ప్రచార సభను జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించగా గోపాల్‌వాడతో పాటు 2టౌన్ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అనంతరం 35వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పీఎస్సార్ మాట్లాడుతూ.. తాను ఈ ప్రాంత ప్రజలకు అధికారంలో లేకున్నా, ప్రజాసేవ చేస్తూ వస్తున్నానని, ఎన్నికల్లో గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు, అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానన్నారు. శ్రీరాంపూర్‌లో పర్యటించగా 6వ వార్డు నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

'ప్రేంసాగర్‌రావు గెలుపు కోసం పాదయాత్ర'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించాలని, హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గూడ శ్యామల–అంజయ్య దంపతులు బుగ్గగట్టు హనుమాన్ ఆలయం నుంచి దండేపల్లి మండలంలోని గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను నర్సింగాపూర్‌కు చెందిన పార్టీ నాయకుడు సాంబారి కుటుంబరావు ప్రారంభించగా, గూడెం ఆలయం వరకు సాగిన పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, బొద్దు శంకర్, కొక్కిరాల రేఖతో పాటు పలువురు మద్దతుగా నిలుస్తూ పాదయాత్ర విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కర్ణమామిడి, గఢ్‌పూర్ గ్రామాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.


గూడ అంజయ్య దంపతులతో పార్టీ శ్రేణులు

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు

- మంచిర్యాల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని మంచిర్యాల నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో గురువారం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. మేనిఫెస్టోను ప్రజలకు వివరించి, గత తొమ్మిదేళ్లుగా రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన పనులను వివరించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే, ప్రజలకు మరిన్ని పథకాలను కల్పించి, ప్రతి ఒక్కరికి మేలు చేస్తామన్నారు.

'ఇళ్ల పట్టాలు ఇప్పించిన ఘనత బీఆర్‌ఎస్‌దే'

నస్పూర్: సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న సింగరేణి కార్మిక, కార్మికేతరులకు ఇళ్ల పట్టాలు ఇప్పించిన ఘనత తమదేనని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. పట్టణ పరిధిలోని 13, 1, 12వార్డులకు సంబంధించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం న్యూ నాగార్జునా కాలనీలో నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బేర సత్యనారాయణ, వంగ తిరుపతి, మడిగ మల్లయ్య, ప్రకాశ్‌రెడ్డి, బండి పద్మ, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

బలగంతో కదిలి.. వాడవాడలా తిరిగి

దండేపల్లి: వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు కోరారు. దండేపల్లి మండలం ముత్యంపేట, కొర్విచెల్మ గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి వాడవాడలా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


మాట్లాడుతున్న నడిపెల్లి దివాకర్‌రావు


దండేపల్లి: ఓటు అభ్యర్థిస్తున్న దివాకర్‌రావు

అవ్వ.. కారు గుర్తును మరువద్దు!

దండేపల్లి: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు దండేపల్లి మండలం తాళ్లపేట, జైతుగూడ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ పథకాలను వివరిస్తూ, ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం

- చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్

చెన్నూర్: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ అన్నారు. పట్టణంలోని గాంధీచౌక్ నుంచి జలాల్ పెట్రోల్ బంక్ వరకు గురువారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సుముఖత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశం మోదీ నాయకత్వంలో నంబర్‌వన్ స్థానానికి చేరిందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. తెలంగాణలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కమలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంటరీ కో కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, సీనియర్ నాయకులు కొండపాక చారి, తలారి రాజు, రమేశ్‌లు పాల్గొన్నారు.

భీమారం: చెన్నూరు నియోజకవర్గంలో మంచిపాలన రావాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ ప్రజలను కోరారు. భీమారం మండలం ఆరెపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎనిమిదేళ్ల నుంచి సొంత ఖర్చులతో గ్రామాల్లో సేవా కార్యాక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. గ్రామాల్లో ప్రజలను మోసం చేసేందుకు తిరిగి ఎన్నికల నేపథ్యంలో పర్యటిస్తున్నారని, వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని అశోక్ కోరారు.


చెన్నూర్: మాట్లాడుతున్న దుర్గం అశోక్


భీమారం: ఊరేగింపులో పాల్గొన్న అశోక్

బీఆర్‌ఎస్ బలోపేతానికి పనిచేయండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: మూడోసారి కేసీఆర్ సీఎం అయ్యేలా బీఆర్‌ఎస్ కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మస్కాపూర్ గ్రామ సింగిల్‌విండో మాజీ చైర్మన్ దొనికేని చిన్నయ్య గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గజేందర్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు. జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఖానాపూర్ పట్టణంలోని ఐదో వార్డులో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్, ఇర్ఫాన్, సతీశ్, వాసేఖాన్, ఫైసల్, దాము తదితరులున్నారు.


ఖానాపూర్‌లో కండువా కప్పుతున్న జాన్సన్‌నాయక్

నేటి సభకు తరలిరావాలి

ఖానాపూర్: జన్నారంలో శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పాల్గొనే ప్రజాశీర్వాద సభకు కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజగంగన్న, మున్సిపల్ చైర్మన్ రాజేందర్ పిలుపునిచ్చారు.

రైతులకు బాసటగా బీఆర్‌ఎస్

ఇంద్రవెల్లి: రైతులకు బాసటగా బీఆర్‌ఎస్ నిలుస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని పిప్రి, చిలాటిగూడ, లక్కుగూడ, దేవాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఖానాపూర్ అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, నాయకులు భీంరావ్, కోవ రాజేశ్వర్, షేక్ సుఫీయన్, పర్సురాం రాథోడ్, శివాజీ పాల్గొన్నారు.

ఓటరు చీటీలు పంపిణీ చేయాలి


బీఎల్‌ఓలకు అందజేస్తున్న ఆర్‌ఐ, ఎంపీడీఓలు

నెన్నెల: గ్రామంలోని ఓటర్లకు సకాలంలో ఓటరు చీటీలు పంపిణీ చేయాలని ఆర్‌ఐ గణేశ్, ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలకు సమావేశం ఏర్పాటు చేసి ఓటరు చీటీలు, ఓటరు గైడ్ బుక్కు, ఓటరు పాంప్లేట్‌లను అందజేశారు. 20వ తేదీలోపు ఈ ఓటరు సమాచార చీటీల పంపిణీని పూర్తి చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఓటరు చీటీలతో పాటు ప్రతి ఇంటికీ, ఓటరు గైడ్ అందించాలని ప్రతీ ఓటరుకు సీ–విజిల్ యాప్‌పై అవగాహన కల్పించే కరపత్రం అందించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

'తప్పుడు పోస్టులు పెడితే చర్యలు తప్పవు'

జైపూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకరిపై మరొకరు కించపరిచేలా, పార్టీల పేరుతో దూషించే విధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జైపూర్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎవరినీ ఉపేక్షించేది లేదని, ఎవరినైనా దూషించేలా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

కుట్టు మిషన్ అందజేత


కుట్టుమిషన్ అందజేస్తున్న సభ్యులు

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి శ్రీ శివ సాయి గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామ్మూర్తి, సభ్యులు సుమతమ్మ, సత్యనారాయణ, ప్రసన్న, వినోద్ శర్మ, ప్రభాకర్, ప్రశాంత్, విక్రమ్, రాకేష్, రిత్విక్ పాల్గొన్నారు.

ఉన్నతి కార్యక్రమంపై అవగాహన


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు రాము

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ప్రాథమికోన్నత స్థాయి గణిత కాంప్లెక్స్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, తాండూర్, నెన్నెల మండలాలకు సంబంధించిన గణిత ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఉన్నతి కార్యక్రమాన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా ఎలా నిర్వహించాలని, యూనిట్ ప్లాన్, టీచింగ్, లెర్నింగ్‌లపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీలు సంతోష్, మధుసూదన్, ఆర్పీ రమేష్, సీఆర్పీ ముడిమడుగుల స్వామి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బుంగ.. ప్రయాణికుల బెంగ



మందమర్రిరూరల్: పట్టణంలోని బియ్యం వ్యాపారుల గల్లి ప్రారంభంలో కల్వర్టుపై ఏర్పడిన బుంగ ప్రమాదకరంగా ఉంది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. కల్వర్టు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించడం వల్లనే బుంగ ఏర్పడిందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరగా మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు


లాడ్జీలో తనిఖీ చేస్తున్న సీఐ వాసుదేవరావు

చెన్నూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, లాడ్జిలలో సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా, ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. లాడ్జిలలో బస చేసే వ్యక్తుల సమగ్ర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని లాడ్జీలు, ఆర్టీసీ బస్సులు, వాహనాలను సీఐ క్రిష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు ఉన్నందునా ప్రజలు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టవద్దని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ వాసుదేవరావు

పోలింగ్‌స్టేషన్ల పరిశీలన

కాసిపేట: మండలంలోని రోట్టిపల్లి, వెంకటపూర్, సోనాపూర్, సాలెగూడ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను, నర్సరీలు, క్రీడాప్రాంగణాలను గురువారం ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పోలింగ్ స్లిప్‌లు, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీలో సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నర్సరీలలో పిచ్చిమొక్కలు తొలగించాలని, ప్రతీరోజు నీరు పోయాలని, త్వరగా నల్లమట్టి, ఎర్రమట్టి, ఎరువులు సేకరించుకోవాల్సిందిగా సూచించారు. ఆయన వెంట ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


ఓటరు కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దండేపల్లి: స్థానిక శ్రీలక్ష్మీ మండల సమాఖ్య కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు దండేపల్లి బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్రాంచి మేనేజర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డిజిటల్ లావాదేవీలకు అలవాటు పడాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు అనిత, సీసీ సురేందర్, వీవోఏలు అనురాధ, వాణి, ఎస్ఎస్‌జీ సభ్యులు పాల్గొన్నారు.


పాటల ద్వారా వివరిస్తున్న కళాకారుడు రమేశ్

'నేతకానీలకు ద్రోహం చేసిన చిన్నయ్యను ఓడించాలి'

బెల్లంపల్లి: నేతకాని కులస్తులకు ద్రోహం చేసిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని నేతకాని మహార్ హక్కుల సంఘం జాతీయ సమన్వయ కమిటీ చైర్మన్ భరత్ వాగ్మారే అన్నారు. బెల్లంపల్లి టీసీఓఏ క్లబ్ ఆవరణలో గురువారం రాత్రి జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చిన్నయ్య, తన సామాజిక వర్గానికి చేసిన మేలేమీ లేదన్నారు. ఏ ఒక్క నేతకానీ వ్యక్తిని రాజకీయంగా ఎదగనీయలేదని మండిపడ్డారు. అగ్రకులాల వారితో చేతులు కలిపి, నేతకానీలను అణగదొక్కారని విమర్శించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్ దుర్గం గోపాల్, జిల్లా అధ్యక్షుడు కామెర దుర్గయ్య, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్, నాయకులు మహేందర్, రాంచందర్, వెంకటలక్ష్మి, నేతకానీ సంఘ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భరత్ వాగ్మారే